ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







చీమకుర్తిలో సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారంలో సిఐటియు కీలకపాత్ర

ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

3లో



బహుమతులు అందుకుంటున్న కళాకారులు

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

4లో

కౌంటింగ్ ప్రక్రియ

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

- ఏర్పాట్లలో లోపాలకు తావివ్వొద్దు..
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కౌంటింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు, ఫలితాలను రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు సిఇఒ, మీడియాకు తెలియజేసేందుకు చేస్తున్న ఏర్పాట్లలో ఎలాంటి లోపం ఉండకూడదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎఎస్. దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఆయన ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఒంగోలు శివారులోని రైజ్ ఇంజనీరింగ్ కాలేజీని గురువారం సందర్శించారు. కౌంటింగ్ దష్ట్యా పూర్తి కావస్తున్న ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల వారీగా కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా టేబుళ్లు, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు కంప్యూటర్ల ఏర్పాట్లు, కౌంటింగ్ గదిలోకి సిబ్బంది, ఏజెంట్లు ప్రవేశించేలా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వేరువేరుగా బ్యారికేడ్ల ఏర్పాటు, కౌంటింగ్ గదిలో జరిగే ప్రక్రియను మొత్తం వివిధ కోణాలలో పర్యవేక్షించేలా సి.సి. కెమెరాల ఏర్పాటు వంటి అంశాలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించి సంబంధిత ఆర్ఒలకు ఆదేశాలు జారీ చేశారు. వి.వి.ప్యాట్ స్లిప్పులను లెక్కించేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ ▶ 2లో

గత నెల మాదిరిగానే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గత నెల మాదిరిగానే ఈ నెల కూడా పింఛన్‌లను ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల డిబిటి ఫెయిల్ అయిన వారికి, ఇతర రాష్ట్రాల కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు, 80 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి డోర్ టు డోర్ పద్ధతిన సచివాలయ సిబ్బంది ద్వారా అందజేస్తామన్నారు. బ్యాంకులకు బదిలీ కాబడిన లబ్ధిదారులను మినహాయించి మిగిలిన వారికి పింఛన్ల బట్వాడా కార్యక్రమం జూన్ 1 నుండి 5వ తేదీ లోపు పూర్తి చేస్తామని తెలిపారు.

ఆత్మ రక్షణకు సెల్ఫ్ డిఫెన్స్ దోహదం

ఉత్సాహపూరిత వాతావరణంలో సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళలు, ప్రజల ఆత్మరక్షణకు సెల్ఫ్ డిఫెన్స్ దోహదపడుతుందని స్టార్ స్పోర్ట్స్ అకాడమీ ట్రైనర్ బి అనీల్ కుమార్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో గురువారం ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన పలువురికి శిక్షణనిచ్చారు. సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను ఆయన నేర్పించారు. అనీల్ కుమార్ మాట్లాడుతూ ఆడపిల్లలు, చిన్న పిల్లలు ప్రమాదం తమ ముందుకు వచ్చినప్పుడు భయంతో కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆపద సమయాల్లో మనల్ని శత్రువుల నుంచి రక్షించుకోవడానికి ఎత్తు, బలం, బరువుతో సంబంధం లేదని, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్ తెలిస్తే చాలని అన్నారు. నేడు నెలకొన్న పరిస్థితులలో పిల్లలకు ఖరీదైన నగలు, విలువైన మొబైల్ ఫోన్లు కొనివ్వకపోయినా ఫర్వాలేదని, ఆత్మరక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ కోర్స్ మాత్రం తప్పక నేర్పించాలని సూచించారు. ఆడబిడ్డలకు ఎక్కడా రక్షణ లేకుండా పోయిందని, కనీసం వారికి వారే రక్షించుకోగల విద్య నేర్చుకోవాలని అన్నారు. ఆత్మరక్షణా మార్గాలు నేర్చుకోవడం ఈ రోజుల్లో ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె రమాదేవి చిన్నారులకు పాటలు, ఆటలు నేర్పారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శుక్రవారం కథ చెబుతాను పేరుతో కథా రచన తరగతి జరుగుతుందని నిర్వాహకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ తెలిపారు.



సమ్మర్ క్యాంప్ శిక్షణలో కొన్ని దృశ్యాలు

కౌంటింగ్ ప్రక్రియ

త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్లకు స్నాక్స్, భోజనం వంటి సదుపాయాలను సంబంధిత ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ దిశగా ఏర్పాట్లు చేయడంతో పాటు అన్ని ఫ్లోర్ లలోని టాయిలెట్లను శుభ్రంచేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సంతనూతలపాడు ఆర్‌ఒ, జెసి ఆర్ గోపాలకృష్ణ, మార్కాపురం ఆర్‌ఒ రాహుల్ మీనా, డిఆర్‌ఒ ఆర్ శ్రీలత, పోస్టల్ బ్యాలెట్ల నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఒలు ఉన్నారు.



సైకిల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రంథాలయాలను వేసవిలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ అన్నారు. గురువారం యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆమె పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పిల్లలు సెల్ ఫోన్లు, ఫేసుబుక్, వాట్సాప్, వీడియో గేమ్స్‌తో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని గ్రంథాలయాలకు పంపించాలన్నారు. గ్రంథాల యాల్లో లభించే పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించి పుస్తక పఠనంపై శ్రద్ధ తీసుకొనేలా కృషి చేయాలన్నారు. పుస్తకాలకు మించిన స్నేహితులు లేరని చెప్పారు. ప్రతి విద్యార్థీ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని ఆమె తెలిపారు. చాలా రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్లో సైకిలింగ్ పోటీలు నిర్వహించారు.



ఉద్యోగం సాధించిన విద్యార్థికి ఆఫర్ లెటర్ అందిస్తున్న కాలేజీ యాజమాన్యం తదితరులు

జాబ్ అచీవర్స్ డే

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్‌జిఐటి పాలిటెక్నిక్‌లో జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 2023-24 వివిధ కంపెనీల ద్వారా ఎంపికైన డిప్లొమా ఇసిఇ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగానికి ఎస్‌జిఐటి కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ విద్యార్థులను అభినందిస్తూ వారికి తగిన సూచనలు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ చేసిన వారిలో 50 మంది డిప్లొమా స్టూడెంట్స్‌కు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ అకడమిక్స్, డాక్టర్ మస్తానయ్య, ట్రైనింగ్ మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ డి కుమార్, వివిధ విభాగాధిపతులు, మూడో సంవత్సరం డిప్లొమా విద్యార్థులు పాల్గొన్నారు.

జిజిహెచ్ డైట్ కాంట్రాక్టర్ తొలగింపు

కొత్త కాంట్రాక్టర్‌కు విధుల అప్పగింత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు సర్వజన వైద్యశాలలో ఆహారం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ అను మెస్ అండ్ బేకర్స్‌ను తొలగించి తరువాత వరుసలో ఉన్న శ్రీ వేంకటేశ్వర అసోసియేషన్‌కు అప్పగించినట్టు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి దుర్గాదేవి తెలిపారు. కాంట్రాక్టర్‌పై వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో విచారించిన తరువాత డైట్ కమిటీ సిఫార్సు మేరకు ప్రస్తుతం డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించామని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సూచనల మేరకు శుక్రవారం నుంచి కొత్త కాంట్రాక్టర్ ద్వారా రోగులకు భోజనం అందజేస్తామని తెలిపారు. భోజనం నాణ్యత, సరఫరా విషయంలో రాజీ పడేది లేదని, కొత్త కాంట్రాక్టర్‌కు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశామని వివరించారు.

బిల్లులు చెల్లించలేదన్నది అవాస్తవం

ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయించారని, పాత కాంట్రాక్టర్‌తో పాటు అను మెస్ బేకరీకి కూడా నిబంధనల ప్రకారం బిల్లులు ఇచ్చామని ఆమె తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మాత్రమే డైట్ సరఫరా, నాణ్యతలో లోపం ఉందని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి దుర్గాదేవి తెలియజేశారు.

ఆర్‌ఒగా వెంకట సత్యనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్ / యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ శ్రీలేఖను తొలగిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 13న జరిగిన పోలింగ్లో యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఘర్షణలు జరిగిన సమయంలో సకాలంలో స్పందించకపోవడంతో ఎన్నికల కమిషన్ యర్రగొండపాలెం ఆర్‌ఒ శ్రీలేఖపై వేటు వేశారు. శ్రీలేఖ స్థానంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎం వెంకట సత్యనారాయణను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ నియమించారు. జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియను ఆర్‌ఒ ఎం వెంకట సత్యనారాయణ పర్యవేక్షించనున్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

పాండు రంగారావుకు నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శ్రీకాకుళం ఉద్యమ పోరాట స్ఫూర్తితో, ప్రతిఘటన పోరాటమే లక్ష్యంగా, తన జీవితకాలం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, ఆచరించి చూపిన విప్లవ యోధుడు కామ్రేడ్ టి పాండురంగారావు (పాండన్న) అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. కామ్రేడ్ పాండు రంగారావు 10వ వర్ధంతి సందర్భంగా శింగరాయకొండలోని అమరవీరుల ప్రాంగణంలో నిర్మించిన ఆయన స్థూపం వద్ద గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె నాంచార్లు అధ్యక్ష వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సిఎస్ సాగర్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు నాగరాజు, డాక్టర్ వెంకటేశ్వర్లు, బాబూరావు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నేత

పాఠశాలకు ఉత్తమ అవార్డు

శింగరాయకొండ : కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జరుగుమల్లి ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. 2023-24 విద్యాసంవత్సరంలో ఆస్ట్రేలియా మెల్బోర్న్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులచే రెజ్యూమే తయారు చేయించారు. దానిని పుస్తక రూపంలో తయారు చేయించగా రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మరియు ఇంటర్మీడియట్ విద్య సంచాల కులు గౌతంగౌర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బి నరసింగరావు, విజయభాస్కర్‌లను శాలువాతో సత్కరించారు.

సమస్యల పరిష్కారంలో సిఐటియు కీలక పాత్ర

- జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు

- ఘనంగా సిఐటియు ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు కీలక పాత్ర వహించిందని జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు తెలిపారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలు సిఐటియు కార్యాలయంలో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు నేటి వరకు ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి, కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి పనిచేస్తుందన్నారు. 54 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా అతిపెద్ద కార్మిక సంఘంగా సిఐటియు ఏర్పడిందన్నారు. 1970 తర్వాత 80 దశకం, 90 దశకంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయటంలో సిఐటియు పాత్ర కీలకంగా ఉందన్నారు. అనేక వేల మంది సిఐటియు కార్యకర్తలు సమసమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంఘంలో పనిచేస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పది సంవత్సరాల కాలంలో అనేక కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు ఆ విధానాలను



ఒంగోలులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సంఘం వ్యతిరేకిస్తుదన్నారు. సిఐటియు 2022 విద్యుత్ చట్టం, 2019 మోటార్ వెహికల్ చట్టం, లేబర్ కోడ్స్ వ్యతిరేకించడంలో, అనేక చట్టాలలోని లోపాలను ఎత్తిచూపుతూ వాటి సవరణలు చేయాలని దేశ వ్యాప్తంగా సిఐటియు పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్స్ నాయకులు చిరంజీవి, ఉదయ్, మున్సిపల్ నాయకులు ప్రసాద్, కోటేశ్వరరావు, రవాణా సంఘం నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు పాపని సుబ్బారావు, ఆర్‌టిసి యూనియన్ నాయకుడు అల్లడి సుబ్బారావు,విశ్రాంత ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య పాల్గొన్నారు.

చీమకుర్తి : కార్మికవర్గ సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. సిఐటియు ఆవిద్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పంగులూరికృష్ణయ్య భవనం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో నూతన ఆర్థిక విధానాలపై, కార్మికవర్గానికి నష్టం చేసే విధానాలపై ,రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలపై పోరాటాలు చేస్తూ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ముఠావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆంజనేయులు,పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, బి.ఓబులేషు, జి.అప్పలనాయుడు, బిందె ఆంజనేయులు, డి.సురేష్, జి. శంకర్, కనకరాజు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టంగుటూరులోని శ్రీనివాస థియేటర్ సెంటర్ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా సిఐటికు జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము మాట్లాడుతూ 1970 మే 30న సిఐటియు ఆర్భావించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి. మోజెస్, కె. శ్రీనివాస్, పేరాబత్తిన శ్రీను, డి.తిరుమల, ఎం. యానాది, టి. పాపారావు, షేక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల : ప్రభుత్వ పాఠశాలలోపనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాయళ్ళ మాలకొండయ్య కోరారు. సిఐటియు ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి నేటికీ 54 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర రత్తమ్మ , కార్మికులు సిహెచ్.యోగమ్మ ,తిరుపాలమ్మ, మస్తాన్ బి.అనురాధ,లక్ష్మి, కొండమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.



టంగుటూరులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



దొనకొండలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దర్శి : తాళ్లూరు మండలం బొద్దికూరపాడు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు వైస్ ప్రెసిడెంట్ ఎస్.రవిప్రసాద్‌రెడ్డి తెలిపారు.భీమిలి పట్టణంలో జూన్ 1న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. బాలుర విభాగంగాలో జి.కుమార్, శివరామకష్ణ, హేమంత్, నందకిషోర్, హుస్సేన్‌బాష, కె.మనోహర్, బాలికల విభాగంగా పి.కోమలి, పి.చందన, పి.అలేఖ్య, సిహెచ్.శిరీష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కార్యదర్శి శ్రీకాంత్, గణేషు అభినందించారు.

గ్రంథాలయంలో మ్యాజిక్‌షో

పామూరు : మూఢనమ్మకాలను పారద్రోలాలని జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం జిల్లా నాయకులు జెడ్. రమణయ్య తెలిపారు. సమ్మర్ క్యాంప్, చిల్డ్రన్ క్యాంపు భాగంగా గురువారం మ్యాజిక్ షో నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి.షమీ, మండల నాయకులు భానుమతి,మదారమ్మ, అంకమ్మ , జెవివి నాయకులు కె.శంకర్ పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కొనకనమిట్ల : మండల పరిధిలోని ఇరసలగుండం గ్రామానికి చెందిన 62 మంది విద్యార్థులకు రైల్వే ఉద్యోగి వంజా చంద్రయ్య స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను ఉచితంగా గురువారం అందజేశారు చేశారు. ఈ పుస్తకాలను ఎక్స్‌ప్రెస్ రైలు గార్డు ఎస్‌ఎల్ శ్రీధర్ ఆర్థిక సహకారంతో ఈ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య ఇంగ్లీష్ బాగా నేర్చుకుంటే భవిష్యత్తులో విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు. విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు సింయాద్రి, బ్రహ్మయ్య, కేశవులు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'గుండ్లకమ్మ' గేట్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ విజయవాడలో ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ నారాయణరెడ్డిని రైతు కౌలురైతు సంఘాల నాయకులు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ 80వేల ఎకరాలకు ఖరీఫ్, రబీలో సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్మించినట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి రైతులకు సాగునీరు, తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రాజెక్టు గురించి పట్టించుకోక పోవడంతో రెండుగేట్లు కొట్టుకు పోయినట్లు తెలిపారు. ప్రాజెక్టులోని నీరంతా వృథా అయినట్లు తెలిపారు. దీంతో కనీసం ఆరుతడులకు కూడా నీరందక రైతులు పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో తాగునీటి కోసం ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించి ఖరీఫ్ సీజన్‌లోనైనా పంటలకు నీరందించాలని కోరారు. దీంతో స్పందించిన ఇంజినీరు నారాయణరెడ్డి మాట్లడుతూ జూన్ మొదటివారం లో మొదటి స్టెప్, చివరి వారంలో రెండవ స్టెప్ లాక్ ఏర్పాటు చేసి ప్రాజెక్టులోకి చేరిన నీటిని నిల్వచేస్తామన్నారు. ఆగస్టు చివరి నాటికి గేట్ల మర్మతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఎస్.అనిల్ ,రైతులు తదిరుతు పాల్గొన్నారు.

చిగురుపాటికి దామచర్ల సత్య పరామర్శ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు, టిడిపి నేత చిగురుపాటి శేషగిరిరావును టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య గురువారం పరామర్శించారు.ఇటీవల చిగురుపాటి శేషగిరి కారుపై పెట్రోల్ పోసి నిప్పుటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా దామచర్ల సత్య చిగురుపాటి శేషగిరిని పరామర్శించారు. కారు ఘటనకు గతల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మూలగుంటపాడుకు చెందిన టిడిపి నాయకులు గుదే వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతుండగా సత్య ఆయన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చీమకుర్తి కష్ణ, మించల బ్రహ్మయ్య, నేలపాటి బాల శంకర్ బాబు, పి. శ్రీనివాసరావు, ముళ్ళపూడి సుదర్శి ప్రసాద్ రావు, సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనావుల్లా, షేక్ యస్థాని, వేల్పుల వెంకట్రావు, మోరు బోయిన యోగానంద, అంబటి శ్రీను, సన్నెబోయిన మల్లికార్జున. చల్లా శ్రీనివాసరావు, గంగవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



శేషగిరిరావును పరామర్శిస్తున్న దామచర్ల సత్య

మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-బాపట్ల

విహారయాత్ర కోసం హైదరాబాదు నుంచి బాపట్ల వచ్చి నలుగురు నల్లమడవాగులో గల్లంతైన విషయం తెలిసిందే. అందులో సునీల్‌కుమార్ (36), అతని కుమారుడు అనురాజ్(11) మతదేహాలను గుర్తించి ఏరియా వైద్యశాలలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో ఇద్దరు ఆచూకీ లభించకపోవడంతో ఎన్‌టిఆర్‌ఎఫ్, సూర్యలంక తీరంలోని గజ ఈతగాళ్ళు, అగ్నిమాపక అధికారులు బృందాలుగా నల్లమడ వాగులో 3 కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. చివరకూ వాగులో గల్లంతైన వడ్లకొండ కిరణ్ గౌడ్ (35), బండా నందు (35) మతదేహాలను గురువారం గుర్తించి బయటకు తీసుకొచ్చారు. రూరల్ సిఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని స్థలాన్ని ఆర్‌డిఒ రవీందర్, తహాశీల్దారు శ్రావణ్ కుమార్, అగ్నిమాపక అధికారులు సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

సైకిల్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఆర్‌టిసి డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక తూర్పు బైపాస్ సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గుంటూరు రమేష్ (36) మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం.. చీమకుర్తి ఇసుకవాగు సెంటర్‌కు చెందిన గుంటూరు రమేష్ కనిగిరి ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బైకుపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందాడు. సిఐ దుర్గాప్రసాదు,ఎస్‌ఐ కృష్ణయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బండరాయితో కొట్టి వ్యక్తి హత్య

ప్రజాశక్తి - ముండ్లమూరు

మద్యం మత్తులో వరుసకు అన్నదమ్ములైన ఇద్దరు ఘర్షణ పడ్డారు. చివరకూ తమ్ముడు వరుసైన వ్యక్తి అన్న వరుసైన వ్యక్తిని బండరాయితో కొట్టి హత్యచేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని సుంకరవారిపాలెం గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... సుంకరవారిపాలెం గ్రామానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు నల్లబోతుల పెద్ద వెంకటేశ్వర్లు, నల్లబోతుల బ్రహ్మయ్య మండల పరిధిలోని గుంటిగంగ గుడి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు గురువారం వెళ్లారు. అక్కడ మద్యం తాగారు. అనంతరం మొక్కులు తీర్చుకొని స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో వెంకటేశ్వర్లు బండరాయితో బ్రహ్మయ్య తలపై కొట్టాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మతి చెందాడు. సమాచారం అందుకున్న సిఐ షమీముల్లా, ఎస్‌ఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో మహిళ మృతి

ప్రజాశక్తి-కొండపి

వడదెబ్బతో ఓ మహిళా మృతి చెందింది. ఈ ఘటన కొండపి బీసీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బీసీ కాలనీ చెందిన కోర్లపాటి అచ్చమ్మ(79) గత మూడు రోజులుగా కాస్తున్న ఎండల తీవ్రతలకు, ఉక్కపోతకు తట్టుకోలేక అనారోగ్యానికి గురైంది. మంచంపై నిద్రిస్తూ అలాగే మృతిచెందింది. ఎండల కారణగా వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంభసభ్యులు తెలిపారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టావారిపాలెంలో పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండపి సిఐ పాండు రంగారావు 8ఎస్‌ఐలు రాజేష్, శివబసవరాజు, కృష్ణబాజిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చివుకుల శేషశాస్త్రి వర్ధంతి సభలో మాట్లాడుతున్న మోహన్

'చివుకుల' స్ఫూర్తితో శ్రామికవర్గ పోరాటాలు నిర్మిద్దాం

ప్రజాశక్తి - బాపట్ల

బ్రాహ్మణ కులంలో జన్మించి, చిన్న వయసులోనే అంటరాని దళితుల శ్రమ దోపిడీ, అగ్రకుల దోపిడీ విముక్తి కోసం పోరాడిన కామ్రేడ్ చివుకుల శేషశాస్త్రి పోరాట స్ఫూర్తితో ఫాసిస్టు పాలకులకు వ్యతిరేకంగా శ్రామిక వర్గం పోరాడాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఆర్ మోహన్ కోరారు. కామ్రేడ్ చివుకుల శేషశాస్త్రి 74 వర్ధంతి సభ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శేషశాస్త్రి 20ఏళ్ళ వయసులోనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో కమ్యూనిస్టు కార్యకర్తగా మారారని అన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ బాపట్ల తాలూకా కార్యదర్శిగా ఉంటూ బాపట్ల మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్మించారని అన్నారు. పారిశుధ్య కార్మికుల అంటరాని తనానికి వ్యతిరేకంగా ఆయన పోరాడారని అన్నారు. ఈ సందర్భంగా శేషశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నల్లమడ రైతు సంఘం నాయకులు విజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది జమ్రుద్ భాష, భాస్కర్ గౌడ్, సిపిఐ సీనియర్ నాయకులు జెబి శ్రీధర్, కె కల్పన, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జివి బ్రహ్మం, మువ్వల పల్లవి, ఎ శ్రీనివాస్, బి లాజర్, ఎంపి రంజాన్, ఎం విల్సన్, ఎస్‌కె అజిత, నాగూర్ బి, వెంకాయమ్మ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బుద్ధం, బిడారిదిబ్బ గ్రామాల్లో ఉపాధి కూలీలు పని చేసే చోటకు వెళ్లి కూలీల సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ తెలుసుకున్నారు. ఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి చట్టం పేద, పేద మధ్యతరగతి రైతు, కూలీలకు ఎంతో ఉపయోగ పడిందని అన్నారు. అటువంటి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే ఎన్ఎంఎంఎస్ యాప్ తెచ్చి ఎప్పుడు లేని విధంగా రెండు పూటలు పని పెట్టి ఉపాధి కూలీలును ఎండల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించటం లేదని అన్నారు. టెంటు, మజ్జిగ, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్లు లేక ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకి అల్లాడిపోతున్నారని అన్నారు. గతంలో ఉపాధి కూలీలకు టెంటు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్, మంచినీరు ఇచ్చే వారని అన్నారు. పలుగు, పార, తట్టలకు డబ్బులు వచ్చేవని, వేసవి పారితోషికం మార్చి నెలలో 20శాతం, ఏప్రిల్, మే, జూన్ నెలలో 30 నుండి 50శాతం ఇచ్చేవారని అన్నారు. ఇప్పుడే వేసవి అలవెన్స్ లేదని అన్నారు. టెంట్లు, మజ్జిగ, మంచినీరు, పలుగు, పార, తట్లలు లేకుండా 2పూటల పనులు చేయాల్సి వస్తుందని అన్నారు. మధ్యాహ్నం తర్వాత పశువులు, మేకలు, పొలం పని చేసుకునే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. ఎప్పటిలాగ ఒక పూట పని విధానంతో ఏడాదిలో 200 రోజులు పనికల్పిస్తూ రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, శ్రీనివాసరావు, దండు సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

◆ చీరాలలో జెండా ఆవిష్కరించిన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



సిఐటియు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మజుందార్



సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి

ప్రజాశక్తి - బాపట్ల

సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55ఏళ్ళ కాలంలో సిఐటియు అనేక సమరశీల పోరాటాలు చేసిందని అన్నారు. కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం చేసిందని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ సిఐటియు కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో, ఐక్య పోరాటాలు చేయడంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినదని అన్నారు. కార్మిక వర్గం ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శరత్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేపల్లె : సీఐటీయు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గ సమస్యలపై రాజీలేని పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలాని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్లో సీఐటీయు జండా సిఐటియు పట్టణ అధ్యక్షులు జె దర్మరాజు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిహెచ్ మణిలాల్ మట్లాడుతూ 1970 మే30న కలకత్తాలో సిఐటియు ఆవిర్భవించిందని అన్నారు. 54ఏళ్ళుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, కార్మిక హక్కులు హరిచటం, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, డిఫెన్స్, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ బ్యాంకుల వంటి వివిధ రకాల ప్రభుత్వరంగ సంస్థలను కార్పోరేట్ కంపెనీలకు అమ్మటానికి సిద్ధమైందని, దీనిని వ్యతిరేకిస్తూ సిఐటియు నిరంతరం ఆందోళనలు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు కె ఆశ్విరాధం, ఎం వెంకటేశ్వరరావు, కె రమేష్, వై కిషోర్, సీహెచ్ అగస్టిన్, కెవి లక్ష్మణరావు పాల్గొన్నారు.

చీరాల : కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యలపై పోరాడుతూ కష్టకాలంలో అండగా ఎర్రజెండా ఉంటుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎఐల్టిడి ఫ్యాక్టరీ గేటు వద్ద, పేరాల సిఐటియు ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఆమె ఆవిష్కరించారు. 1970 మే 30న సిఐటియు ఏర్పడిందన్నారు. దేశంలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ అతిపెద్ద కార్మిక సంఘాల సమాఖ్య సిఐటియు అన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకై ఉద్యమించే వేగుచుక్క సిఐటియు అన్నారు. దేశంలో ఏ మూల కార్మికుల సమస్య ఉన్న సిఐటియు పోరాడుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కలిస వేతనాల అమలు, శ్రమకు తగ్గ ఫలితం కోసం పోరాడుతుందని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇస్తేనే కార్మికులు మనుగడ సాగించలేరని అన్నారు. కార్మిక చట్టాల అమలుకై జరిగే ఉద్యమంలో కార్మికులు ఐక్యంగా కలిసి రావాలని కోరారు. కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు, అధ్యక్షుడు ఎన్ బాబురావు, జి సుధీర్, జి సుధాకర్, సాంబశివరావు, ఎస్‌కె కాలేషా, సిహెచ్ శివరాజు, సురేష్, పోతురాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పర్చూరు : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు బి చిన్నదాసు సిఐటియు జెండా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు మాట్లాడారు. సిఐటియు ఆవిర్భవించి 54ఏళ్లు అయిందని అన్నారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ కార్మికుల వెన్నంటి ఉందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం డేవిడ్, కార్యకర్తలు పి పోతురాజు శ్రీను, భాష, వలి, ప్రకాశం, బాబు పాల్గొన్నారు.

చిన్నగంజాం : ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి జి ప్రతాప్ కుమార్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ బొమ్మ వద్ద సిఐటియు జెండా గురువారం ఆవిష్కరించారు. కార్మికులు ఐక్య పోరాటాలతో హక్కులు కాపాడుకోవాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు యాకోబు, ప్రకాష్, జకరయ్య, రిక్షా యూనియన్ నాయకులు అనీల్, పుల్లారావు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు అధ్యక్షులు మణిలాల్



పర్చూరులో జెండా ఆవిష్కరిస్తున్న బి చినదాసు



చినగంజాంలో జెండా ఆవిష్కరిస్తున్న జి ప్రతాప్

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

- ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం
- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చీకటిపువ్వు
- తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కౌసల్యాసుప్రజారామ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానాల వారసత్వం అంతరించి పోకుండా నేటి భావి తరాలకు అందించడానికి శ్రీకారం, రోటరీ కళా పరిషత్ ఆధ్వర్యంలో 14వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రదర్శనను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నాటికలు తిలకించిన వీక్షకులను ఆలోచింపచేశాయని అన్నారు. మూడు రోజులు పాటు మార్టూరులో నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలు బుధవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో గుంటూరు అభినయ సమర్పణలో ఎన్ రవీంద్రారెడ్డి దర్శకత్వంలో శ్రీ స్నిగ్ధ రచించిన ఇంద్ర ప్రస్థం నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. కరీంనగర్ చైతన్య కళాభారతి సమర్పణలో మంచాల రమేష్ దర్శకత్వంలో పి శివరాం రచించిన చీకటిపువ్వు ఉత్తమ ద్వితీయ నాటికగా, కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ సమర్పణలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో శ్రీ స్నిగ్ధ రచించిన కౌసల్యా, సుప్రజా రామ నాటికను తృతీయ ఉతమ నాటికగా న్యాయ నిర్ణేతలు డాక్టర్ గోవాడ వెంకట్, అంబటి మురళీ కృష్ణ, డాక్టర్ ఎంఎస్ చౌదరి ఎంపిక చేశారు.

ఉత్తమ నటులు వీరే

ఉత్తమ నటుడిగా విశాఖపట్టణం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన నిశ్శబ్దమా, నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి పిపి వరప్రసాదరావు, ఉత్తమ నటిగా కరీంనగర్ చైతన్య కళాభారతి ప్రదర్శించిన చీకటి పువ్వు నాటికలో పవిత్ర పాత్రధారి జి లహరి ఎంపికయ్యారు. ఉత్తమ సహాయ నటుడిగా పొన్నూరి రసఝరి ప్రదర్శించిన కాపలా నాటికలో విజయానంద్ పాత్ర దారి జివి మనోహర్, ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా ఇంద్రప్రస్థం నాటికలో సౌందర్య పాత్రధారి కుసుమశాయి, ఉత్తమ హాస్యనటుడిగా రాజుగారి గోచి నాటికలో మహారాజు పాత్రధారి గోరంట్ల సురేంద్ర, ఉత్తమ విలన్‌గా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో పల్లవి పాత్రధారి డి హేమ ఎంపికయ్యారు.

ఉత్తమ దర్శకుడు

ఉత్తమ దర్శకుడిగా కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ సమర్పించిన కౌసల్యా సుప్రజా రామ దర్శకుడు గోపరాజు విజయ్, ఉత్తమ రచయిత ఇంద్రప్రస్థం నాటికను రచించిన స్నిగ్ధ ఎంపికయ్యారు. ప్రత్యేక బహుమతులను కాపలా, రైతేరాజు బంధం, రాత నాటికల్లో ప్రతిభ కనబరచిన నటులు భాగ్యరాజ్, భవాని, తిరుమలరావు, ప్రసాద్, సురభి రాఘవ ఎంపికయ్యారు. విజేతలకు శ్రీకారం, రోటరీ కళాపరిషత్ కన్వీనర్, ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, శ్రీకారం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, జాష్టి అనురాధ, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు బహుమతులను అందజేశారు. ఈ నాటిక పోటీల్లో పాల్గొన్న 125 మంది కళాకారులకు, సాంకేతిక నిపుణులకు శ్రీకారం, రోటరీ ఆధ్వర్యంలో వ్యక్తిగత బహుమతులు అందజేశారు. మూడు రోజులు జరిగిన నాటిక పోటీలను విజయవంతం చేసిన కళాకారులు, కళాభిమానులకు శ్రీకారం కన్వీనర్ జాష్టి మోహనరావు అభినందనలు తెలిపారు.



క్రీడా దుస్తులు అందిస్తున్న నరేంద్ర వర్మ

రగ్బీ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక జూనియర్ బాలికల రగ్బీ జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గురువారం అందజేశారు. ఈ నెల 31నుండి జూన్ 1 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ రగ్బీ క్రీడా పోటీలకు కర్లపాలెం మండలం చింతాయపాలెం హై స్కూలు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. దుస్తులతో పాటు రగ్బీ క్రీడా కిట్టును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ క్రీడా కార్యదర్శి పిట్టు సుబ్బారెడ్డి, నక్కల వెంకటస్వామి, నాగలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ వాయిదా

ప్రజాశక్తి - బాపట్ల

ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 3న జరగాల్సిన పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ జూన్ 6కు వాయిదా వేసినట్లు స్థానిక పాలిటెక్నిక్ కౌన్సిలింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ టి రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ఆప్షన్స్ ప్రక్రియ జూన్ 7 నుండి 10 వరకు నిర్వహిస్తామని తెలిపారు. 11న ఆప్షన్స్ మార్చుకునే అవకాశం ఉందన్నారు. 13న సీటు కేటాయింపు జరుగుతుందని అన్నారు. కౌన్సిలింగ్ తేదీల మార్పులను విద్యార్థులు గమనించాలని కోరారు.

రోజు వారీ వేతనం రూ.600 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజావక్తి- కొత్తపట్నం

ఉపాధి పనులు చేసున్న కూలీలకు రోజు వారీ వేతనం రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఈతముక్కల పేరంటాలకుంట, సోమవరప్పాడు చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం బందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నేపత్యంలో పని ప్రదేశంలో మజ్జిగ,తాగు నీరు,ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. నీడకు పట్టలు, మెడికల్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం రోజు వేతనం రూ.300 ప్రకటించగా రూ.150నుంచి 200 లోపే కూలి వస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పినా ఆచరణలో అమలు జరగటం లేదన్నారు.సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం గడ్డపారలు, పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే కూలీలకు ఎలాంటి రక్షణ లేదన్నారు. ప్రమాద బీమా ఐదు లక్షలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పిల్లి కష్ణ, కూలీలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు : ఉపాధి కూలీ చేసిన పనికి కొలతల ప్రకారం కూలి వేసే పద్ధతిని రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. క్యూబిక్ మీటర్ ప్రకారం ఉపాధి కూలీలు పని చేస్తేనే కూలి వేస్తామంటూ ప్రభుత్వం చేసిన నిర్ణయం కూలీల కడుపు కొడుతుందన్నారు. ప్రస్తుతం 45 డిగ్రీల ప్రమాదకరమైన మండుటెండలల్లో కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. భూమి గట్టిగా ఉండటం వల్ల గడ్డపార వేస్తే ఎగిరి వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చెప్పిన కొలత పద్ధతుల్లో పనిచేయటం అసాధ్యమన్నారు. కొలతల పద్ధతిని రద్దుచేసి రోజువారి కూలీ ప్రవేశపెట్టాలన్నారు. నిర్ణీత సమయం ప్రకారం పనిచేయించాలన్నారు. రోజువారీ కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్, శాంతకుమారి, లక్ష్మి, వెంకటేశ్వర్లు, కష్ణారెడ్డి, ఏడుకొండలు, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, తుళ్లూరు రమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కొండపి : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి.మస్తాన్ తెలిపారు. మండల పరిధిలోని పెట్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెవి. మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి క్రమంగా నిధులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమ్ము బ్రాహ్మయ్య, ఎర్ర బ్రాహ్మయ్య, అంజమ్మ, కోటిరత్నం, హుస్సేనమ్మ, సాంబయ్య పాల్గొన్నారు.

కేన్సర్‌ను గుర్తించకపోతే ముప్పే

- తొలిదశలో గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చు

- డాక్టర్ ఆవి. రఘునందన్, సీనియర్ కన్సల్‌టెంట్ రేడియేషన్ అంకాలజిస్టు

ప్రజాశక్తి-ఒంగోలు

కేన్సర్ తొలిదశలో గుర్తించక పోతే ప్రాణానికి ముప్పు తప్పదని ఒంగోలులోని హెచ్‌సిబి ఎంఎన్ఆర్ కేన్సర్ సెంటర్ సీనియర్ కన్సల్‌టెంట్, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ ఆవి. రఘునందన్ తెలిపారు. వ్యాధి ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయవచ్చునని తెలిపారు. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా ఆయన కేన్సర్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. దేశంలో ఏటా సుమారు రెండు లక్షల మంది కేన్సర్ వ్యాధికి గురవుతున్నారు. మన రాష్ట్రంలో సుమారు 20 వేల మంది వ్యాధి భారిన పడుతున్నట్లు తెలిపారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల నోటి కేన్సర్, ఊపిరి తిత్తుల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. నోటిలో పుండు వచ్చి 15 రోజులకు మించి తగ్గక పోతే అది కేన్సర్ లక్షణంగా గుర్తించాలన్నారు. మహిళల్లో అధిక భాగంగా గర్భసంచి, రొమ్ము కేన్సర్ వస్తున్నట్లు తెలిపారు. మహిళలు పెళ్లికి ముందే హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించు కుంటే కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉండదన్నారు. సిటీ స్కాన్, ముక్త పరీక్ష, రక్త పరీక్ష, అల్టా స్కానింగ్ ద్వారా కేన్సర్ వ్యాధిని గుర్తించవచ్చునని తెలిపారు. దూమపానం, మద్యం పానానికి దూరంగా ఉంటే కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉండదన్నారు. హెపటైటీస్ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు కోవడం వల్ల లివర్ కేన్సర్ రాదన్నారు. కేన్సర్ రాకుండా ఉండాలంటే పండ్లు, కూరగాయాలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కేన్సర్ వ్యాధి నివారణకు ప్రస్తుతం మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో ఆపరేషన్ చేసే అవకాశం ఉందన్నారు. ఆపరేషన్‌కు వీలుకాని వారికి రేడియేషన్, కీమో థెరపి ద్వారా చికిత్స అందిస్తున్నట్లు హెచ్‌సిబి ఎంఎన్ఆర్ కేన్సర్ సెంటర్‌లో జిల్లాలోనే మొట్టమొదటి సారిగా అత్యాధునిక ప్రమాణాలలో కూడిన రేడియేషన్ థెరిఫి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ సుమారు 6 వేల మందికి రేడియేషన్ థెరపి అందించినట్లు తెలిపారు. తమ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ, ఇఎస్‌హెచ్, ఇఎస్ఐ ద్వారా ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



ఆమె పట్టుదల శిఖరమంత..

- తండ్రి ఇచ్చిన ధైర్యంతో ఉన్నత స్థానాలకు..

- నేడు ఉద్యోగ విరమణ చేయనున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ సలగాల నరసమ్మ



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సాధారణ కానిస్టేబుల్ కుమార్తె అయిన ఆమెను ఉన్నత లక్ష్యాలు శిఖరాన నిలబెట్టాయి. కష్టాలొస్తే బెదిరిపోలేదు. కన్నీళ్లకు కుంగిపోలేదు. ధైర్యంగా ముందుకు అడుగువేశారు. ఉన్నత స్థానాలు అందుకోగలననే నమ్మకంతో సాగారు. పరాభవం అనే మాటను దూరం పెట్టారు. లక్ష్యతీరాలకు చేరుకున్నారు. ఆమె యర్రగొండపాలెంకు చెందిన సలగాల నరసమ్మ. ప్రస్తుతం తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా ఆమె జీవిత గమనంలో ఒడిదుడుకులు, స్ఫూర్తి ఘట్టాలను సందర్భంగా ప్రజాశక్తితో పంచుకున్నారు. అవి ఆమె మాటల్లోనే..

బాల్యం చదువు ఇలా..

ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెంకు చెందిన సలగాల కొండయ్య, రాజమ్మ దంపతులకు నలుగురు ఆడ పిల్లలం. వారిలో నేను పెద్దదాన్ని. మా నాన్న కానిస్టేబుల్. ఇంటర్ వరకూ యర్రగొండపాలెంలోనే పూర్తి చేశాను. డాక్టర్ కావాలని కోరిక ఉంది. ఎంసెట్ రాస్తే విజయవాడలోని సిద్దార్ధ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. అప్పుడు డొనేషన్ రూ. ఐదు వేలు కట్టమన్నారు. మా అమ్మ రూ. ఐదు వేలు డొనేషన్ కట్టడానికి ఒప్పుకోలేదు. నీ ఒక్కదానికే రూ. ఐదు వేలు ఖర్చు చేస్తే మిగతా ముగ్గురిని ఎలా పెంచాలి. వారికి పెళ్లిళ్లు ఎలా చేయాలని అని అన్నారు. డొనేషన్ కట్టడానికి ఒప్పుకోలేదు. దీంతో బాపట్ల కాలేజీలో అగ్రికల్చర్ బిఎస్‌సి గ్రూపులో జాయిన్ అయ్యాను. డిగ్రీ పూర్తి చేశా. తర్వాత ఎంఎస్‌సి చేశాను. ఆ తర్వాత పిహెచ్‌డి కోసం రాజేంద్ర నగర్ అగ్రికల్చర్ యూనివర్శిటీకి వెళ్లా. రోస్టర్ సిస్టం వల్ల పిహెచ్‌డి సీటు రాలేదు.

ఉన్నత చదువు కోసం..

ఎపి స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఉందని తెలిసి అక్కడికి వెళ్లాను. హైదరాబాద్ నగర్‌లోని ఉప్పల్‌లో చిన్నాన్న ఇంట్లో కొన్ని రోజులు ఉన్నాను. ఎపి స్టడీ సర్కిల్ గురించి తెలుసుకొని దానికి సంబంధించిన పరీక్ష రాసి ఎంపికయ్యాను. డిగ్రీ, పీజీలో వచ్చిన మార్కులు చూసి సీటు ఇచ్చారు. ఆ కోచింగ్ సెంటర్‌లో చేరి ఒక్క దానినే రూములో ఉన్నాను. మా నాన్న ఇచ్చిన ధైర్యమే నేను ఇంతలా కష్టపడేలా చేసింది. మా అమ్మ డబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేది. ఇది కూడా నా జీవితంగా బాగా ఉపయోగ పడింది. అప్పుడు ప్రిలిమ్స్‌కు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అనే సబ్జెక్టు తీసుకొని ప్రిపేర్ అయ్యాను. పుస్తకాలే జీవితంగా భావించి చదివాను. మొదటి ప్రయత్నంలోనే పాసయ్యా.. మెయిన్స్ చదువుతున్నప్పుడు సత్తయ్య పరిచయమయ్యారు. ఆయన కూడా అదే సబ్జెక్టు చదువుతున్నారు. నాకు అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. సత్తయ్యకు గ్రూపు 2లో ఉద్యోగం వచ్చింది.

భర్త సత్తయ్య సహకారం..

మెయిన్స్ చదువుతున్నప్పుడు పరిచయమైన సత్తయ్య.. మా ఇద్దరికి ఉద్యోగాలు వచ్చిన తర్వాత నన్ను పెళ్లి చేసుకోమని అడిగారు. నేను కూడా ఇష్ట పడ్డాను. అయితే మా ఇద్దరిదీ ప్రేమ వివాహం కాదు. రెండు కుటుంబాల్లో చెప్పుకున్నాం. మొదట్లో మా నాన్న ఒప్పుకోలేదు. ఆ తర్వాత అన్ని రకాలుగా విచారించి సరేనన్నారు. ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. ఇంటర్వ్యూకు సంబంధించి నా భర్త సత్తయ్య నాకు శిక్షణ ఇచ్చారు. ఇంటర్వ్యూకు హాజరు కావడానికి ఢిల్లీకి వెళ్లాం. మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ పరీక్షలో విజయం సాధించాను. ఐఆర్ఎస్ వచ్చింది. నిజానికి ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ అంటే ఏమిటో కూడా తెలియదు. సత్తయ్య కూడా గ్రూపు 2కు సెలక్ట్ అయి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ తహశీల్దార్‌గా చేరారు. అంచెలంచలుగా ప్రమోషన్లు పొంది జాయింట్ కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేశారు.

ఇద్దరు బాబులు ఉన్నత స్థాయిలో..

మాకు ఇద్దరు మగ పిల్లలు. మొదట్లో వారిని బాగా చదివించుకుంటానో లేదోనని బాధపడేదానిని. ప్రస్తుతం మొదటి బాబు సురభి ఆదర్శ ఐఎఎస్ అధికారి. ప్రస్తుతం తెలం గాణ రాష్ట్రంలోని ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్నాడు. రెండో బాబు సురభి అభిలాష్ డాక్టర్ (ప్రస్తుతం ఎండీ రెండో సంవత్సరం చదువుతున్నాడు). మా అమ్మ కేన్సర్ కారణంగా చనిపోయింది. అందుకని చిన్నబాబుని డాక్టర్‌ని చేశా.

వైపాలెంలో సేవ చేయాలని ఉంది..

పుట్టి పెరిగిన సొంత గడ్డకు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం సేవ చేయాలని ఉంది. ఇప్పటికే యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశా.. విధి నిర్వహణలో ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగ పూర్తి కాలాన్ని విని యోగించుకొని ఉద్యోగ విరమణ చేస్తున్న సంద ర్భంగా ఇప్పటివరకు సహకరించిన తోటి ఉద్యోగుల కు, సిబ్బందికి నరసమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సమస్యను పరిష్కారానికి చర్యలు : గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. నీటి సమస్య పరిష్కారం లో భాగంగా 13వ వార్డులో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఆ వార్డు కౌన్సిలర్ రిజ్వాన ఖాలక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గఫార్ మాట్లాడుతూ వర్షభావపరిస్థితులు కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోయినట్లు తెలిపారు. దీంతో కనిగిరి పట్టణంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నట్లు తెలిపారు. నీటి సమస్య తలెత్తకుండా దశలవారీగా శాశ్వత పరిష్కారం తీసుకొనేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మన్సూర్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న అబ్దుల్ గఫార్



లెమన్ స్పూన్ ఆడుతున్న చిన్నారులు

వేసవి శిబిరంలో చరిత్ర పాఠాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్ర, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసును ఉపాధ్యాయుడు సూర్య బోధించారు. శిక్షణ ప్రారంభంలో పిల్లల చేత కథలు చెప్పించడం, కథలు చదివించడం చేశారు. తరువాత చదరంగం, స్కిప్పింగ్, క్యారమ్, ల్యూడో స్నేక్ ఆటలను ఆడించారు. ఈ శిబిరంలో 8 మంది పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కే సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న నిర్వాహకులు

పెద్దదోర్నాల శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించారు. పది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు కథలు చదివించడం, కథలు చెప్పించడం, చదరంగం, ఖోఖో, యోగా తదితర అంశాలపై ఫ్యాకల్టీ జె శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం ఫ్రీజర్ ఏర్పాటు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు అవసరమైనవారికి ఉచితంగా అందించేందుకు ఫ్రీజర్ ఏర్పాటు చేయనున్నట్టు దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లొక్కు శరత్‌బాబు తెలిపారు. మృతదేహాలను ఒకటి రెండు రోజులు నిల్వ ఉంచేందుకు సరైన సౌకర్యం లేక పేదలు, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొమరోలు మండలంలోని అన్ని గ్రామాల ప్రజల సౌకర్యార్థం తాము ఉచితంగా సరఫరా చేసేందుకు ఫ్రీజర్ ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఫ్రీజర్ అవసరం ఉన్నవారు మొబైల్ నెంబర్ 77022 92279లో సంప్రదించాలని సూచించారు.

గుణాత్మక విద్య అందించాలి: ఎంఇఒ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గుణాత్మక విద్య అందించడమే ధ్యేయంగా పని చేయాలని యర్రగొండపాలెం మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు గురువారం తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా అంకితభావంతో పని చేయాలని చెప్పారు. సమయానికి స్కూలుకు చేరుకొని విద్యార్థులకు విద్యనందిస్తే మెరుగైన సాధించవచ్చని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ప్లే గ్రౌండ్ స్థలం తప్పనిసరన్నారు. పాఠశాలకు సమీపంలోనే ప్లేగ్రౌండ్ ఉండాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్లే గ్రౌండ్ లేకపోయినా, సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ఫీజులు వసూలు చేసినట్లు తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫీజుల వివరాలు పాఠశాలలో ప్రదర్శించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు, అంగడి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నట్లు తమకు ఫిర్యాదు అందితే చర్యలు చేపడతామన్నారు. బడి బస్సుల భద్రతపై ట్రాన్స్‌పోర్ట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కండిషన్‌లో లేని బస్సులను రద్దు చేయాలని కోరారు.

ఘర్షణ వాతావరణాన్ని పసిగట్టాలి

ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ప్రత్యేక ఎస్‌పి హిమవతి

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఎలాంటి ఘర్షణ వాతావరణం నెలకొంటుందో ముందుగా పసిగట్టాలని, గొడవలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే స్పందించాలని, గొడవను సర్దుబాటు చేసేలా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించాల్సిన సమయం ఇదేనని ప్రత్యేక ఎస్‌పి హిమవతి సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి గొడవలకు తావులేకుండా పర్యవేక్షించేందుకు ఎస్‌పి హిమవతి మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో పోలీస్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. మార్కాపురం డివిజన్‌లో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మార్కాపురం పట్టణంలోనూ నిఘా ఉంచాలన్నారు. ఏ చిన్న గొడవ కూడా జరగడాన్ని వీల్లేదన్నారు. గొడవలకు పాల్పడేవారు ఎంతటివారైనా కఠినంగా వ్యవహరించాలని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం ప్రశాంత వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు. కార్యకర్తలు కయ్యానికి కాలు దువ్వడం సరికాదన్నారు. గొడవల్లో పాల్గొన్నవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఆమె హెచ్చరించారు. సమీక్షలో మార్కాపురం డిఎస్‌పి ఎం బాలసుందరరావు, మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మార్కాపురం పట్టణ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు పటిష్ట బందోబస్తు: ఎస్ఐ

జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్‌కె ఎస్‌కె అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మార్కాపురం పట్టణంలో 51 సీసీ కెమెరాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాలలో ఆధునిక



మాట్లాడుతున్న ప్రత్యేక ఎస్‌పి హిమవతి

టెక్నాలజీతో పనిచేసే డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాలలో పికెట్లను ఏర్పాటు చేయడంతో పాటుగా, మొత్తం 3 రూట్ మొబైల్‌తో తిరుగుతూ ఏదైనా ప్రాంతంలో సమస్య ఉంటే నిమిషాల్లో ఆ ప్రాంతానికి చేరే విధంగా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నారు. పట్టణంలో 144 సిఆర్‌పిసి మరియు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలందరూ కౌంటింగ్ తర్వాత వెలువడే ఫలితాలను బట్టి సంయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. విజయోత్సవ ర్యాలీలు జరపటం గానీ, పార్టీ జెండాలతో గ్రామాల్లో ర్యాలీగా వెళ్లడం గానీ, బాణసంచా కాల్చడం గాని, గుంపులుగా ఉండి రంగులు చల్లుకోవడం గాని ఎట్టి పరిస్థితులలో అనుమతించేది లేదని స్పష్టం చేశారు.



ఎస్ఐ సుదర్శన్

యర్రగొండపాలెం: సాధారణ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ 4వ తేదీన యర్రగొండపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని యర్రగొండపాలెం ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. మండలంలో ప్రజలు ఏ పార్టీ అభ్యర్థులు గెలిచినా గొడవలకు వెళ్లరాదని తెలిపారు. శాంతియుతంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం, వెనుక నుంచి రెచ్చగొట్టే పనులు చేసినా తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే అటువంటి వ్యక్తుల వివరాలు సేకరించినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలంతా పోలీస్ వారికి సహకరించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా కృషి చేయాలని తెలిపారు.

కంభం రూరల్: సాధారణ ఎన్నికలు 2024 కౌంటింగ్ సందర్భంగా జూన్ 4వ తేదీన కంభం మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పులి రాజేష్ తెలిపారు. కాబట్టి ప్రజలు ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా ఉండరాదని అన్నారు. బాణసంచా కాల్చడం కానీ.. వీధుల వెంట గెలుపు సంబరాలను చేసుకోవటం గాని, రంగులు చల్లుకోవడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ప్రజలు పోలీస్ వారి సూచనను గమనించి సహకరించాలని ఆయన కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎస్ఐ మధుసూదనరావు

కొమరోలు: సాధారణ ఎన్నికలు–2024 ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4వ తేదీన మన కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కాబట్టి ప్రజలు ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా ఉండడం కానీ.. బాణసంచా కాల్చడం కానీ.. వీధుల వెంట గెలుపు సంబరాలను చేసుకోవటం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. కొమరోలు మండల ప్రజలు పోలీస్ వారి సూచనను గమనించి అందుకను గుణంగా పోలీస్ వారికి సహకరించాలని కోరారు. జూన్ 4న ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



కె నీరజ, వ్యవసాయ సహాయ సంచాలకులు

యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాల రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు కె నీరజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 74,670 ఎకరాల ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం కాగా ప్రధానంగా మిరప, పత్తి, కంది, వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారని తెలిపారు. గత ఖరీఫ్‌లో కాలువలకు సాగర్ జలాలు విడుదల కాలేదన్నారు. ఈ ఖరీఫ్‌లో సాగర్ నీరు వస్తే త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో వరి సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈసారి మాగాణి, మెట్ట ప్రాంతాల్లోనూ మిరపతో పాటు పొగాకు సాగు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 1,650 భూసార మట్టి పరీక్షలు నిర్వహించి రైతులకు ఫలితాలు అందజేసినట్లు చెప్పారు. ఆ ఫలితాల ఆధారంగా మూడేళ్ల పాటు పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఖరీఫ్‌లో అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. 72 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఖరీఫ్, రబీ సీజన్‌లకు గాను 5,600 మెట్రిక్ టన్నుల ఎరువులు తెప్పించేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పురుగు మందుల కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఇండెంట్ పెడతామన్నారు. రైతులకు అవసరమైన పురుగు మందులకు రైతు భరోసా కేంద్రాల్లో నగదు చెల్లిస్తే వెంటనే వాటిని తెప్పించి రైతులకు అందజేస్తామన్నారు. 76 క్వింటాల జీలుగలు, 129 క్వింటాల జనుములు, ఐదు క్వింటాల పిల్లి పెసర విత్తనాలను రాయితీపై తెప్పించినట్లు చెప్పారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని వాటిని పొందవచ్చునని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులను వరిసాగుకే కాకుండా మిరప సాగు చేసే ముందుగా పొలంలో కలియ దున్నడం వలన తామర పురుగును అరికట్టవచ్చునని తెలిపారు. అలాగే అన్ని రకాల పైర్లకు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవచ్చునని చెప్పారు. తద్వారా తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చునని అన్నారు.

కార్మిక హక్కుల పోరాట సారథి 'సిఐటియు'

ప్రజాశక్తి-మార్కాపురం



సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న రఫీ

'సిఐటియు' కార్మికుల హక్కుల పోరాట సారథి అని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుక ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా రఫీ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఐక్యత–పోరాటం నినాదంతో 1970 మే 30న సిఐటియు ఆవిర్భవించిందన్నారు. దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించే వేగుచుక్క సిఐటియు మాత్రమే అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, శ్రమకు తగిన ఫలితం కోసం సిఐటియు అనేక పోరాటాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఆటో, బిల్డింగ్, ముఠా, అనేక రంగాలలోని కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న సంఘంగా సిఐటియుకు పేరుందన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నికరంగా సిఐటియు పోరాడుతోందన్నారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్స్, మిడ్ డే మీల్స్, ఉపాధి హామీ, వివోఏ, ఆర్‌పిలతో పాటు తదితర స్కీం వర్కర్స్ సమస్యలపై ఛాంపియన్‌గా సిఐటియు పనిచేస్తోందని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ కార్మికులను ఐక్యం చేసి సమాన పనికి సమాన వేతనం, రెగ్యులర్ చేయాలని సిఐటియు నేటికీ పోరాడుతోందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని, రైతాంగ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి కార్మిక కర్షక ఐక్యత చాటి చెప్పే విధంగా సిఐటియు పని చేస్తోందని అన్నారు. అందరూ సిఐటియును మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు కె.సుబ్బరాయుడు, మిడ్ డే మిల్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తటవర్తి గురునాథం, జి హరి, పి సలాంఖాన్, పిఎ బ్రహ్మం, పి శ్రీను, ఎం చెన్నకేశవులు, కనకయ్య, సింగ్, ఎస్‌కె యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా నిరుపయోగంగా ఆటోలు

- పంచాయితీ ఆవరణలో తుప్పుబట్టి దర్శనమిస్తున్న ఆటోలు
- ప్రభుత్వాలు మారితే ప్రజల సొమ్ము నేలపాలెనా?

ప్రజాశక్తి - ఇంకొల్లు

దాదాపు ఐదేళ్ల క్రితం టిడిపి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలోని పంచాయతిల్లో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను సంపదగా మార్చేందుకు ఈ ఆటోలను ఆయా పంచాయతీ ఆదాయ పరిధిని బట్టి కేటాయించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అత్యధిక సీట్లు గెలుచుకుని అధికారానికి వచ్చింది. ఆ తర్వాత చెత్తనుండి సంపద తయారీ పథకాన్ని వదిలేశారు. అప్పటినుంచి ఈ ఆటోలను ఉపయోగించ లేదు. చెత్తను ఎరువుగా మార్చి రైతులకు ఉపయోగపడే విధంగా చేయడంతోపాటు పంచాయితీకి ఆదాయంగా పొందే కార్యక్రమాన్ని ఆపివేసింది. జగన్ సిఎంగా ఉండగా వాటి వైపు మంత్రులు కానీ, అధికారులు కానీ చూడలేదు. వాటిని ఉపయోగించే ఆలోచన కూడా చేయలేదు. దీంతో ఆటోలు నిరుపయోగంగా ఉన్నాయి. ఐదేళ్ల నుంచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుబట్టి శిథిలావస్థకు చేరాయి. 15 ఆటోలు వృధాగా తుప్పుపట్టాయి. ఆటోలతొ చెత్త సేకరించి ఎరువుగా మార్చాలనుకున్నారు. వర్మి కంపోస్టు యార్డులు నిర్మించారు. రైతుల పొలాల సారవంతం చేసేందుకు అప్పటి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.

టిడిపి పథకం కాబట్టే వైసిపి నిరుగార్చిందా!

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత టిడిపి తీసుకొచ్చిన పథకాలను రద్దు చేసింది. అందులో భాగంగానే ఈ ఆటోల వైపు చూడలేదు. ఈ పథకం గురించి విచారించి ఆచరణలో పెట్టటానికి మంత్రులు, అధికారులు కనీస చొరవ చూపలేదు. టిడిపి ప్రవేశపెట్టిన పథకం కాబట్టి అమలు చేసేందుకు అధికారులు కూడా ధైర్యం చేయలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇంకొల్లులో ఈ ఆటోల ఖరీదు రూ.50లక్షలు

పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంజూరు చేసిన ఆటోలే 15 నుంచి 20 వరకు ఉన్నాయి. ఈ ఆటోల ఖరీదు ఒక్కొక్కటి రూ.2లక్షల వరకు ఉంటుందని అంటున్నారు. ఈ లెక్కన 26ఆటోల ఖరీదు రూ.50లక్షల వరకు ఉంటుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56మండలాల్లో 2 వేల ఆటోలు టిడిపి ప్రభుత్వంలో మంజూరు చేసినట్లు సమాచారం. వైసిపి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని అటకెక్కించి వందల కోట్ల ప్రజాధనం వృధా చేసింది.



ముళ్లచెట్ల మధ్యలో పంచాయితీ ఆటోలు

ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అనందం

ప్రజాశక్తి - చీరాల



కె వీరాంజనేయులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ వారికి ఆర్థిక చేయూత అందించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని ఎస్ఎ ఆర్ఆర్ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె వీరాంజనేయులు అన్నారు. పాఠశాల అభివృద్ధితోపాటు ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ చేస్తున్న అనేక పోరాటాల్లో తాను ముందున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యత కలిగినదని అన్నారు. తమ వద్ద చదువుకున్న ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని అన్నారు. 1985లో ఇంకొల్లు బాలికల హైస్కూల్ గణిత ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. 1986 నుండి ఎస్ఏఆర్ఆర్ ఎం హై స్కూల్లో విధులు నిర్వహిస్తూ 2004లో హెచ్ఎంగా పదోన్నతి పొందినట్లు తెలిపారు. అప్పటి నుండి పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేసినట్లు తెలిపారు. దాతల సహాయంతో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం సహకారంతో బాధ్యతగా విధులు నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. 39ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో తన కుటుంబ సభ్యులతోపాటు మిత్రులు, స్నేహితులు సహాయపడ్డారని గుర్తు చేసుకున్నారు. యుటిఎఫ్ ద్వారా ఉపాధ్యాయ సంక్షేమ కోసం భవిష్యత్తులో తన వంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు. యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యుని వరకు బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తెలిపారు. టిటిడి కళ్యాణ మండపం ఎదురు రోడ్డులో నూతనంగా నిర్మించిన యుటిఎఫ్ భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. 2022లో తమ దంపతులు యుటిఎఫ్ భవనానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. తన ఉద్యోగ విరమణతోపాటు అదేరోజు యుటిఎఫ్ భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రకృతిలో లభించే ఆకులు, అలములతో తయారు చేసిన కషాయాలు పంటలపై పిచికారి చేస్తే ఆరోగ్యవంతమైన దిగుబడులు వస్తాయని డిపిఎం అనంత లక్ష్మణాచారి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. భూములు దుక్కి దున్నిన వెంటనే నవధాన్యాలను వెదజల్లితే తొలకరి చినుకులకు మొలిచి 40రోజుల అనంతరం భూమిలో కలయదున్నితే భూసారం పెరుగుతుందని అన్నారు. ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేపడితే రైతులకు అధిక దిగుబడులతో పాటు ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించారు. పిఎండిఎస్ కిట్స్ తయారీ, ఆవులు కొనుగోలు, ఎన్‌పిఎం షాపులు ఏర్పాటుకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు ఎపిఎం శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జై మోహన్, శ్రీవల్లి పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై ఐటి నిపుణుల నిఘా

- రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు పోస్టులపై గ్రూప్ అడ్మిన్‌దే బాధ్యత - ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన తరువాత వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రాం ఇతర గ్రూపుల్లో ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు ఎవరైనా పోస్టు చేస్తే సంబంధిత గ్రూప్ అడ్మిన్ లే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఐటీ కోర్ విభాగంలో నిష్ణాతులైన పోలీస్ అధికారులు, సిబ్బందితో సామాజిక మాధ్యమాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన తరువాత సోషల్ మీడియాలో ప్రజలను, ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలను, అభ్యర్థులను రెచ్చగొట్టే విధంగా సందేశాలు, ఫోటోలు పోస్టు చేయవద్దని అన్నారు. గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా గ్రూప్‌లలో ఇతరులను కించపరిచే పోస్టులు పంపితే వాటిని వెంటనే డిలీట్ చేసి పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకర, రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు ఎవరైనా పోస్ట్ చేస్తే 8333813228 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జూన్ 4న జరుగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్ జోన్‌గా పరిగణిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్ బాషా ఉత్తర్వులు ఇచ్చారని, ఆ ప్రదేశాలలో డ్రోన్లు ఎగరవేయటం నిషేధమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రెడ్ జోన్ పరిధిలో భద్రత కారణాల దష్ట్యా ఆజ్ఞలు ప్రతి ఒక్కరికి వర్తిస్తాయన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఓట్ల లెక్కింపు రోజు ట్రాఫిక్ మళ్లింపు..

ప్రజాశక్తి-బాపట్ల

ఓట్ల లెక్కింపు రోజు బాపట్ల కు వచ్చి వెళ్లే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బాపట్ల డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ అన్నారు గురువారం రాత్రి డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలకు కౌంటింగ్ రోజు అభ్యర్థులు, ఏజెంట్లు సుమారు 4వేల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. సుమారు వెయ్యి వివాహనాలు రావచ్చన్నారు. గుంటూరు నుండి బాపట్ల , చీరాల వైపు వెళ్లే వాహనాలను బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వద్ద నుంచి హైవే ద్వారా దారి మళ్ళించమన్నారు.బాపట్ల పట్టణంలోకి వాహనాలను అనుమతించార న్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల దూరంలో వాహనాలు నిలిపివేయాలి. పాసులు జారీ చేసిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ పాలిటెక్నిక్ కళాశాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఘనంగా జాబ్ అచీవర్స్ డే గురువారం నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో డిప్లమా చివరి సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో 73మంది వ్యలియో ఫ్రిక్షన్ మెటీరియల్స్, గాడ్రెజ్ కన్స్యూమర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్ఎల్ మాండో, టీవీఎస్ సుందరం, ఫార్చునర్స్ లిమిటెడ్, సూర్య ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలకు ఎంపికయ్యారని అన్నారు. విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిలో కొందరికి అత్యధిక వార్షిక వేతనం రూ.3.32లక్షలు ఉండగా సరాసరి వార్షిక వేతనం రూ.2లక్షల వరకు సాధించారని అన్నారు. వ్యలియో ఫ్రిక్షన్ మెటీరియల్స్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ పి ప్రకాష్ హాజరయ్యారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాం డెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, అంకితభావం కనబరిచి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు కృషి చేసిన సిబ్బందిని అభినం దించారు. డిప్లమా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె విజయ భాస్కరరెడ్డి, డిపిఓ ఎన్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వనమ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కిమ్స్ మేనేజర్ అమర్నాథ్

గ్రామీణ వైద్యులదే కీలక పాత్ర

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న గ్రామీణ వైద్యులదే వైద్య రంగంలో కీలక పాత్ర ఉంటుందని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ అమర్నాథ్ కొనియాడారు. ఇంకొల్లు రోటరీ గంగ భవనంలో ఇంకొల్లు మండల ప్రాథమిక వైద్యులు తో కలిసి కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి డాక్టర్ల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. కిమ్స్ హాస్పిటల్ నందు ఉన్న ఆధునిక ఆరోగ్య పరికరాల గురించి విశ్లేషించారు. భవిష్యత్తులో మరెన్నో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి డాక్టర్ల జనరల్ సెక్రెటరీ నాదెండ్ల శ్రీను, ఆర్ఎంపీ డాక్టర్ భాష, మండల ఆర్ఎంపీలు, కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.



రోశయ్య కాలనీలో మాట్లాడుతున్న సిఐ జి సోమశేఖర్

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఓట్ల లెక్కంపు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 2వ పట్టణ సిఐ జి సోమశేఖర్ హెచ్చరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు ప్రకారం, డిఎస్పి బేతపూడి ప్రసాద్ ఉత్తర్వులు మేరకు ఓట్ల లెక్కింపు సమయంలోగాని, తర్వాతగాని ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు రోశయ్య కాలనీలో ఎస్ఐ మురళి, స్టేషన్ సిబ్బందితోపాటు స్పెషల్ పోలీస్ సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. రౌడీ షీటర్లకు వాళ్ల ఇంటి వద్దనే కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా పోలీస్ ఉత్తర్వులను అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి, రౌడీ షీట్స్‌ను ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

వేటపాలెం : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎస్ఐ జి సురేష్ మండలంలో గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. రామన్నపేట, వేటపాలెం, దేశాయిపేట పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయం, కుందేరు, రావూరు రోడ్డు వద్ద వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. 30 ద్విచక్ర వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేశారు. సంబంధిత వాహన దారులు సరైన పత్రాలు చూయించి తీసుకెళ్లాలని సూచించారు.

నిజాంపట్నం : జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపద్యంలో అడవులదీవి పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ వెంకట రవి తెలిపారు. గ్రామాల్లో ప్రజలు గుంపులుగా ఉండటం నిషేధమని అన్నారు. సోషల్ మీడియా వేదికగా ఎవరు రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదని అన్నారు. గొడవలు జరిగితే సోషల్ మీడియా అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముండ్లమూరు : తమ్మలూరులో ఎస్ఐ పి ఆంజనేయులు, తాళ్లూరు ఎస్ఐ రమణయ్య తమ సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ గురువారం నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని 15 వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐలు తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎఎస్ఐలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మహేష్, శ్రీను పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి..

- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు

- కౌంటింగ్ తర్వాత ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలి
- ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కౌంటింగ్ సందర్భంగా గొడవలు/అల్లర్లు, పరస్పర దాడులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలతో జిల్లా ఎస్‌పి గురువారం ఒంగోలులోని పోలీస్ కల్యాణ మండపంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతం ఎక్కువగా ఉందని, కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో ఫలితాలు ఎలా వచ్చిన స్వాగతించాలని, రాజకీయ పార్టీలు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. కౌంటింగ్ తరువాత ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని, ఘర్షణలకు పాల్పడరాదని, పరస్పర దాడులకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరు కూడా గుంపులు, గుంపులుగా ఉండకూడదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయటానికి సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద వాహనాలు డైవర్షన్ చేయడం జరుగుతుందని, కౌంటింగ్ ఏజెంట్లు కేటాయించిన సమయం కంటే ముందుగానే ఆ ప్రదేశంలో చేరుకోవాలని, కేటాయించిన ప్రదేశంలో వాహనాలను నిలుపుకోవాలన్నారు. సమావేశంలో సిఐడి అదనపు రవి వర్మ, ఒంగోలు డిఎస్‌పి యం కిషోర్ బాబు, సిఐడి డిఎస్‌పి యం.మోహన్ రావు, ఒంగోలు సబ్ డివిజన్ సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్